# ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రేక్షకులు కాకూడదు..! హక్కులు అడుగుదాం...!

## ✱ 'రైతేరాజు' నిజమేనా..!

రాష్ట్రంలో కనీసం 70 శాతం పౌరుల జీవితం వ్యవసాయం దాని అనుబంధ పరిశ్రమలు, వ్యాపారాలతో ముడిపడి ఉంది. వ్యవసాయంలో లాభంవస్తే రైతుకు మిగిలేది గోరంతే కాగా రైతేతర వ్యాపారులకు దక్కేది కొండంత. అదే వ్యవసాయంలో నష్టం వస్తే మాత్రం మొత్తం భారం రైతు మీదే పడుతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో రైతులకు ప్రభుత్వం పూర్తి అండదండలందిస్తూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుండగా మనదేశం, రాష్ట్రంలో మాత్రం ఉన్న కొద్దిపాటి సౌకర్యాలు, సబ్సిడీలు ఎత్తి వేస్తూ వ్యవసాయమంటే దురదృష్టవంతులు చేసేదిగా మార్చారు. ఒక వైపు నిత్య జీవితంలో పెరుగుతున్న ఆర్థికభారం మరోవైపు వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సంక్షోభం, అది తప్ప మరో జీవనాధారం లేని రైతాంగాన్ని అప్పులపాలు చేసి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయి.

నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (NCRB) విడుదల చేసిన వివరాల ప్రకారం 1995 నుండి 2013 డిసెంబర్ మధ్య 18 సం॥ల కాలంలో కరీంనగర్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 4563 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. స్వరాష్ట్రం ఏర్పడిన జూన్ 2, 2014 నుండి జూలై 2015 వరకు జిల్లాలో 133 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. తమ శ్రమశక్తిని కోల్పోవటం తప్ప ఎవరి శ్రమను దోచుకోని ఏకైక ఉత్పత్తి రంగం రైతు చేసే వ్యవసాయం. అటువంటి అదర్శనీయ ఉత్పత్తి క్షేత్రంలో వేలాది మంది రైతులు చనిపోతూ చేసే ఆర్తనాదాలు ఎవరి చెవులకు వినబడక పోయేంత స్పందనా రహిత స్థితికి చేరుకున్నాం.

వ్యవసాయం కోట్లాది మనుషుల జీవనాధారం, వారి ఆత్మగౌరవం, వారి జీవించే హక్కు. వ్యవసాయ రంగాన్ని ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తూ రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగిస్తున్న ప్రభుత్వాలు, అలాగే రైతులను అడుగడుగునా దగా చేసే అడ్తిదారులు, విత్తన, ఎరువుల వ్యాపారులు ఇతర అనేక రకాల కువ్యాపారులంతా రైతుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. ఇది న్యాయ పరిభాషలో ఒక మనిషిని ఆత్మహత్యకు పురి గొల్పటం (సెక్షన్ 306 ఐ.పి.సి) కిందకు రాగల నేరానికి తక్కువేమి కాదు.

ఈ పరిస్థితి మారాలి. వ్యవసాయం లాభదాయకంగా ఉండే విధంగా ప్రభుత్వ విధానాలుండాలి. అప్పుడే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయి. ఇకనైనా రైతు జీవనాధార హక్కుకు జీవించే హక్కుకూ రక్షణ ఉండగలదా..!

## ✱ దిక్కుతోచని చేనేత - ఆగని వలసలు

కరీంనగర్ జిల్లాలో మరో ఆత్మహత్యల కేంద్రం సిరిసిల్ల చేనేత రంగం వీరి పరిస్థితి మరీ ఘోరం. ఆకలి చావులను పోలిన వీరి ఆత్మహత్యల ఘోష హృదయ విదారకం. వలసల్లో మహబూబ్‌నగర్ తర్వాత స్థానం కరీంనగర్ జిల్లాది. పొట్టకూటి కోసం వలస వెళ్లాటమంటే నాగరికత పరిణామ క్రమంలో ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తి దశకు వచ్చి తిరిగి ఆహార సేకరణకు తిరోగమించటమే. ఇన్ని వలసలు, వలసల వెతలు కళ్ళముందు అలాగే ఉండగా ఇక మనం " స్మార్ట్ విలేజ్ " ల్లోకి ప్రవేశించబోతున్నాం.

## ✱ సంఘటిత శక్తిని కోల్పోతున్న కార్మిక రంగం

తెలంగాణ ఏర్పడే వరకు ప్రభుత్వరంగ సంస్థలను సర్వనాశనం చేశారని ఆంధ్రనాయకత్వాన్ని తిట్టిన తెలంగాణ నాయకులు ఈ రోజు కొత్తగా ఒక్కటైనా ప్రభుత్వరంగ పరిశ్రమను స్థాపించే మానసిక స్థితిలో లేరు. ఉన్న వాటిని కాపాడుకోవాల్సిన అగత్యం అయా కార్మికుల పైన పడింది. దీంతో విద్యార్థులకు సైతం హక్కులు లేని, భద్రత లేని దిన కూలీల వంటి కాంట్రాక్ట్ ఉద్యోగాలే గతి అయ్యాయి.

ఇందులోనూ అసంఘటిత రంగ, శారీరక కార్మికుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది నన్ను గెలిపిస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులే లేకుండా చేస్తానన్న నాయకుడు ఈ రోజు మున్సిపాలిటి కార్మికులు కాంట్రాక్ట్‌లో నైనా కొద్దిపాటి జీతం పెంచమంటే వారితో చర్చించకుండా మీదో దిక్కుమాలిన సమ్మె అంటున్నారు. వారిపై పోలీసుల బలగాన్ని ప్రయోగిస్తున్నారు.

తెలంగాణ ముద్దుబిడ్డ పి.వి. నర్సింహారావు, మాజీ హైటెక్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచబ్యాంక్ సూచనలతో చేసిన నిర్వాకంతో తెరలేచిన కాంట్రాక్ట్ ఉద్యోగపర్వం మనుషులను ఉద్యోగ భద్రత నుండే కాక సామాజిక చింతన నుండి, వివిధ ఉద్యమాల్లో భాగస్వామ్యం నుండి దూరం చేసింది. అవే పునాదుల మీద మన తెలంగాణ ముఖ్యమంత్రి మరింత పోలీస్ బలప్రయోగాన్ని ఉపయోగించి సామాజిక స్పృహ ఉండకూడని, ఉద్యమాల్లేని రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా కొనసాగాలనుకుంటున్నారు.

## ✱ స్త్రీల పట్ల వివక్ష తగ్గింది - లైంగిక హింస పెరిగింది.

స్త్రీ పురుష వివక్షలో సమాజంలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. స్త్రీలపై గృహ (భర్త, అత్తమామల) హింస చాలావరకు తగ్గింది. స్త్రీలను కుటుంబంలోను, సమాజంలోను పాత సాంప్రదాయంలో లాగా తక్కువ స్థాయి వారిగా చూడటం కూడా తగ్గుతున్నది. ఆ మేరకు సంతోషించాల్సిందే. కానీ ఇంటి బయట స్త్రీలపై లైంగిక హింస విపరీతంగా పెరిగింది. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు బయట అడుగు పెట్టాలంటేనే భయపడాల్సివస్తున్నది. ఒక వైపు స్త్రీలకు బయట పెరుగుతున్న విద్య, ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు వారికి కొత్త సమస్యలు తెచ్చి పెడుతున్నాయి.

అరబ్బుదేశాల్లో స్త్రీలకు సామాజిక స్వేచ్ఛ తక్కువే కానీ అక్కడ స్త్రీలపై అఘాయిత్యం జరిగిందంటే సమాజం ఉలిక్కి పడుతుందట. మన దగ్గర అన్నీ సర్వసాధారణం. స్త్రీలపై జరుగుతున్న హింసను పురుషాధిక్యా సమాజమే కాకుండా చట్ట సంస్థలు కూడా తక్కువ స్థాయి నేరాలుగా చూస్తున్నాయి. అటువంటి నేరాలపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదవ్వటమే గగనమైతే కోర్టుల్లో కేసులు దశాబ్దాల తరబడి వాయిదాపడుతున్నాయి. ఈ విషయంలో చట్ట సంస్థల, వాటిని పర్యవేక్షించే ప్రభుత్వాల ఘోర వైఫల్యం కారణంగా స్త్రీలపై నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. స్త్రీలకు రాజ్యాంగంలో సమానమైన హక్కు ఉంది. కానీ అది అనుభవించే పరిస్థితి లేదు. అవకాశాలు కల్పిద్దామా..!

## ✱ ఊగండి భక్తితో - కాకుంటే చీప్‌లిక్కర్ తో

ఎవరు కాంట్రాక్టర్లో (సారాతో పాటు) ఎవరు రాజకీయ నాయకులో తెలియని స్థితిలో మనముందు గుడుంబాకు ప్రత్యామ్నాయం పేరుతో చీప్‌లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజలను గుడుంబా మానండి-చీప్ లిక్కర్ తాగండి అని చైతన్యం చేశారు. పైగా మీరు ఎంత చీప్ లిక్కర్ తాగితే మాకంత నష్టం తెలుసా అని వాపోయారు. ప్రజలంతా చీకొట్టే సరికి వెనక్కి తగ్గారు.

గుడుంబా అనేది గిరిజన తండాల్లో సాంప్రదాయిక మద్యం. ఇతరుల నుండి డిమాండ్ పెరిగిన కొద్దీ కల్తీ అయింది వాస్తవమే కానీ గుడుంబా అమ్మకాన్ని అరికట్టకుండా సారా అమ్ముతానంటాడు మన ముఖ్యమంత్రి. చీప్ లిక్కర్ (తెలంగాణ చీప్‌లిక్కరే అనుకోండి) మాత్రం ఆల్కహాల్ కాదా ఏంటి ? అది ఆరోగ్యానికి ఏ హాని చేయదా! ఇదేం పాలనరా బాబూ అని మనం సీసాలు.....సారీ తలలు బద్దలు కొట్టుకోవాలి. లౌకిక రాజ్యాంగానికి లోబడాల్సిన ముఖ్యమంత్రి అది మరిచి ఒక వైపు తమ తనతో పాటు ప్రభుత్వ యంత్రాగాన్ని, రాష్ట్రాన్ని ఒక మతానికి చెందిన భక్తి పారవశ్యంలో ముంచుతూ మరోవైపు సారా (తీర్థం) డ్రమ్ముల్లోనూ ముంచుతానంటాడు. ఇక మనకు భక్తికి, ముక్తికీ కొదువ ఉండకూడదని వారి ఉద్దేశ్యంకాబోలు బాబూ నీ చీప్‌లిక్కర్ వద్దు... గుడుంబా వద్దు... అసలు మద్యమే వద్దు అందామా...

## ✱ పర్వత హననమూ - హక్కుల హననమే

కరీంనగర్ జిల్లాలో గుట్టలను మాయంచేస్తూ బండలను విదేశాలకు అమ్ముకుని అనకొండల్లా బలుస్తున్న గండరగండలందరూ నేరుగా రాజకీయాల్లో ఉన్నారు. గుట్టలతో ప్రజల అనుబంధం, చరిత్ర, ప్రకృతి శోభ, పర్యావరణం అంశాలే కాక ఇవన్నీ వర్తమాన, భవిష్యత్ ప్రజలకు సమిష్టిగా చెందాల్సిన ఆస్తి. నదులు, సముద్రాలు, గుట్టలు, పర్వతాలు, అడవుల మొదలగు ప్రకృతి సంపదన్నింటిపై ఆ ప్రాంతపు (ఆ ఊరు మాత్రమే కాదు) ప్రజలకు, ఆమాటకొస్తే సమస్త జీవరాశులకూ అనుభవించే హక్కు ఉంది. అటువంటి విలువైన ఉమ్మడి ఆస్తిగా గల, పునఃసృష్టి చేయలేని సంపదను కొద్దిమంది స్వార్థబుద్ధితో వినాశనం చేయటం అంటే లక్షమంది ప్రజలకు గల వాటిని అనుభవించే హక్కును కాలరాయటమే ఇకనైనా ఈ ప్రకృతి విధ్వంసాన్ని ఆపమని ప్రభుత్వాన్ని అడుగుదాం.

## ✱ స్వరాష్ట్ర పాలన

కొత్త రాష్ట్రం ఏర్పడి స్వరాష్ట్ర ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వానికి గల ఐదేళ్ళ కాల పరిమితిలో 25% పూర్తయింది. తెలంగాణ ఏర్పడితే అన్ని వర్గాలు, అన్ని సమూహాలు తమతమ జీవితాల్లో ఎంతో కొంత అభివృద్ధికర మార్పు వస్తుందని నమ్మారు. ఇప్పుడా నమ్మకం పోతున్నది. ఇక విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగుల కలలు పూర్తిగా ఇస్త్రీ అయిపోతున్నాయి. తెలంగాణ ప్రజల ఉద్యమ శ్రమ, త్యాగాలు, ఆకాంక్షలు స్వరాష్ట్ర సాధనతో పాటు కొత్త చంద్రబాబు నాయుడునూ సృష్టించాయని భావించాల్సి వస్తున్నది.

చంద్రబాబు నాయుడు, కె.సి.ఆర్. ఇద్దరూ రైతుల నుండి భూములు గుంజుకోవటానికి మోది ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త భూసేకరణ చట్టానికి బేషరతుగా మద్దతు తెలిపారు. దేశవ్యాప్త ప్రజా వ్యతిరేకతకు భయపడి మోదీ ఆర్డినెన్స్‌కు వెనక్కి తీసుకున్నారు. కానీ రాష్ట్రాల్లో విడివిడిగా వీరిద్దరూ అదే చట్టాన్ని తెగల ఘనులు. గతంలో చంద్రబాబు నాయుడు ఇజ్రాయిల్ నుండి ప్రత్యేక లాఠీలను తెప్పించినట్టు కె.సి.ఆర్. కొత్తగా అధికారంలోకి వచ్చీ రావటంలోనే పోలీస్‌శాఖకు వందల కోట్ల రూపాయలు క్షణాల్లో రిలీజ్ చేసి హైదరాబాద్ పోలీస్‌లకు ఇన్నోవా కార్లను, ఇతర ప్రాంతాల వారికి బోలెరో వాహనాలు కొన్నారు. 108 అంబులెన్స్‌లు పాడై ఉపయోగపడే స్థితిలో లేక ఎమర్జెన్సీ కాల్ చేసినా అంబులెన్స్‌లు రావటంలేదు. సిబ్బంది సైతం ఏనాటి నుంచో అడుగుతున్నా ఉద్యమపాలకులు ఈ రోజు వరకు కూడా ఒక్క కొత్త అంబులెన్స్ కూడా కొనలేదు.

స్వరాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలైన సాగునీటి అందుబాటు, ఉద్యోగాల సాధన, సీమాంధ్రుల నుండి తెలంగాణ ఆక్రమిత భూముల విడుదల ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను బలోపేతం చేయటం, వలసలను అరికట్టడం వంటివి క్రమంగా కనుమరుగవుతున్నాయి. కనీసం అధికార పార్టీగా తన ఎన్నికల వాగ్దానాలైన కె.జి. టు పి.జి. విద్య, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, దళితులకు మూడెకరాల భూమి, జిల్లా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చటం కూడా అటకెక్కబోతున్నాయా? అన్నట్టు ఈ మధ్య " బంగారు తెలంగాణ " అనే మాట ఎందుకో వినబడటం లేదు. అంతా మిథ్య అంటే, అన్నీ గాలిమాటలేనంటే రాజకీయ నాయకులు ప్రజల్ని ఏ స్థాయిలో జమకడుతున్నారో ఒక్కసారి ఆలోచించుకోండి.

## ✱ జిల్లా మహాసభలు ✱

హక్కులంటే రాజ్యాంగం కల్పించినవి మాత్రమే కాక సామాజిక, నాగరికత పరిణామ క్రమంలో ఎదుగుతున్న ప్రజాస్వామిక ఆకాంక్షలను హక్కులుగా గుర్తించాలని హక్కుల ఉద్యమం భావిస్తుంది. మనుషులందరికీ ఒకే విలువ ఉండాలని, హక్కుల పరిశీలనలో మానవీయత ఉండాలని కోరుతుంది. ప్రజలకు, ప్రజాస్వామిక విలువలకు శక్తిమేరకు తోడ్పడటం తప్ప మరో వ్యక్తిగత ఎజెండా లేని హక్కుల ఉద్యమంలో కరీంనగర్ జిల్లాలో గోపి రాజన్న, జాప లక్ష్మారెడ్డిలు ప్రాణాలు కోల్పోయారు. బాలగోపాల్ ఇచ్చిన స్ఫూర్తి, దిశా నిర్దేశంతో పనిచేస్తున్న కరీంనగర్ జిల్లా మానవ హక్కుల వేదిక ఈ నెల 13వ తేదీ జిల్లా మహాసభలు జరుపుకుంటున్నది. బుద్ధి జీవులందర్నీ మాతో కలిసి రమ్మని కోరుతున్నాం

ప్రధాన వక్తలు:

**జస్టిస్ కె. చంద్రకుమార్** (హైకోర్ట్ రిటైర్డ్ న్యాయమూర్తి)

**యస్. జీవన్‌కుమార్** (మానవ హక్కుల వేదిక, అధ్యక్షులు)

**వి. శాంతి ప్రబోధ** (అధ్యక్షులు, ప్రజాస్వామిక రచయిత వేదిక)

**వి.యస్. క్రిష్ణ** (మానవ హక్కుల వేదిక, ప్రధానకార్యదర్శి)

స్థలం: **ప్రెస్‌క్లబ్, కరీంనగర్.**

తేది: **13-09-2015 ఆదివారం**

సమయం: **ఉ॥ 10-00 లకు**

**- మానవ హక్కుల వేదిక**

**కరీంనగర్ జిల్లా కమిటీ.**

ప్రచురణ కర్తలు : వి. సుధాకర్‌రెడ్డి, యం. అయిలయ్య సెల్: 9949210801

జయశ్రీ ప్రింటర్స్, జమ్మికుంట. సెల్: 9849215373